# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

APRIL - 2016

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి :**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6:00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6:30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2:30 గంటలకు రక్షణ |
| ప్రతి ఆదివారం ఉదయం | : | 7:00 గం॥ మనకాపరి టి.వి. (తెనాలి గుంటూరు ఏరియాలో) |
| ప్రతిరోజు ఉదయం | : | 7:00 గం॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | **జాషువా గూటం**<br>**రిక్కీ గూటం**<br>**రోనీ గూటం** |

పై కార్యక్రమములను టి.వి.లో చూడండి.

మీ బంధు మిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

**P.O. BOX. 80, KAKINADA**

**PIN : 533004, Ph : 0884 - 2363722**

**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు
## THE WORD OF TRUTH


P.O. Box-80, Kakinada, A.P. 533 004
Ph : 0884 - 2363722, 98489 98547

Editor :
**JOSHUA GOOTAM**


Pleading for Restoration of First Century Christianity

సంపుటి-36 ఏప్రియల్ - 2016 సంచిక 9


## క్రైస్తవ నిరీక్షణ (The Christian Hope)

అపో, పౌలు కొరింధులోని క్రైస్తవులకు ఇట్లు వ్రాసెను: "భూమిమీద మన గుడారమైన యీ నివాసము శిథిలమై పోయినను, చేతిపనికాక దేవునిచేత కట్టబడినదియు నిత్యమైనదియు నైన నివాసము పరలోకమందు మన కున్నదని యెరుగుదుము. మనము దిగంబరులము కాక వస్త్రము ధరించుకొనిన వారముగా కనబడుదుము. కాబట్టి పరలోకము నుండి వచ్చు మన నివాసము దీనిపైని ధరించుకొన నపేక్షించుచు దీనిలో మూల్గు చున్నాము. ఈ గుడారములో నున్న మనము భారము మోసికొని మూల్గు చున్నాము. ఇది తీసివేయవలెనని కాదుగాని మర్త్యమైనది జీవము చేత మ్రింగివేయబడునట్లు, ఆ నివాసమును దీనిపైని ధరించుకొన గోరుచున్నాము. దీని నిమిత్తము మనలను సిద్ధపరచినవాడు దేవుడే; మరియు ఆయన తన ఆత్మ అను సంచకరువును మనకను గ్రహించియున్నాడు. వెలి చూపువలన కాక విశ్వాసమువలననే నడుచుకొనుచున్నాము. గనుక ఈ దేహములో నివసించుచున్నంతకాలము ప్రభువునకు దూరముగా ఉన్నామని యెరిగి యుండియు ఎల్లప్పుడును ధైర్యముగల వారమై యున్నాము. ఇట్లు ధైర్యము గలిగి యీ దేహమును విడిచిపెట్టి ప్రభువునొద్ద నివసించుటకు ఇష్టపడుచున్నాము. కావున

దేహమునందున్నను, దేహమును విడిచినను ఆయన కిష్టులమై యుండవలెనని మిగుల అపేక్షించుచున్నాము. ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచి వైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింధి 5:1-10).

**క్రీస్తు యేసునందలి నిత్య జీవమే** క్రైస్తవునియొక్క గొప్ప నిరీక్షణయై యున్నది. ఆ నిరీక్షణ భూసంబంధమైన వెయ్యేండ్ల రాజ్యముకాదు. క్రైస్తవుని నిరీక్షణ రక్షింపబడిన వారి నిత్య రాజ్యమైయున్నది. ఆ రాజ్యమే రక్షింపబడిన వారి ఆత్మల నిత్య నివాసమై యున్నది. అదే పరలోకము. క్రైస్తవునికున్న ఈ నిరీక్షణను అపొ. పౌలు 2వ కొరింధి 5వ అధ్యాయములో చక్కగా వర్ణించెను.

ఈ నిత్య నివాస నిరీక్షణను గూర్చి 2 కొరింధి 4వ అధ్యాయములోనే అతడు వ్రాయనారంభించెను. 5:1లో అతడిట్లు వ్రాసెను: "భూమి మీదమన గుడారమైన యీ నివానము శిథిలమైపోయినను, చేతిపనికాక దేవునిచేత కట్టబడినదియు, నిత్యమైనదియునైన నివానము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము.'' పరలోకము యధార్ధమని పౌలు ప్రగాఢముగ విశ్వసించెను. అతడొకసారి అందులో ప్రవేశించెను. గనుక దానిని గూర్చి అతడెరుగును. కొరింధీయులకు రెండవ పత్రిక వ్రాయుటకు పదునాలుగు సంవత్సరములకు ముందు అతడు మూడవ ఆకాశమునకు, అనగా పరదైసునకు కొనిపోబడెను (2 కొరింధి 12:2). దేవునియొక్క వాగ్దానములను బట్టి, అతని స్వానుభవమునుబట్టి పౌలు పరలోకము యధార్ధమైన స్థలమని నమ్మగలిగెను. చేతితో చేయబడిన యీ భూనివాసము ఎంత సత్యమో చేతితో కాక దేవునిచేత కట్టబడిన నిత్య నివానమగు పరలోకము అంతే సత్యము.

2కొరింధి5:2-6లో భూనివాసమునకు, నిత్యనివాసమునకు గల తారతమ్యమును అతడు విపులముగ సూచించెను. భూమిమీద మన గుడారమైన యీ నివానములో మూల్గుచుందుము. ఈ మూల్గులు

శరీరసంబంధమైన శోధనలవలనను, హింసలవలనను కలుగును. అందువలన యీ భూనివాసము పరలోక నివాసముచేత మ్రింగివేయబడు సమయమునకు, తాత్కాలికమైనది జయింపబడు సమయమునకు మర్త్యమైనది నిత్య జీవముచే నిత్యత్వముచే మ్రింగివేయబడు సమయముకొరకు క్రైస్తవుడు ఆశతో ఆపేక్షించుచుండును. మనము నిత్యము యీ భూమిపై నివసించునట్లు దేవుడు మనలను సృజింపలేదు. తానుగాని, మిగిలిన క్రైస్తవులుగాని నిత్యము ఈ భూమిపై జీవించెదరని పౌలు ఊహించలేదు. ఈ భూమి ఒకానొక దినమందు నాశనము చేయబడునని అతడెరుగును.

క్రీస్తునందు నూతన సృష్టియైన మానవులకు నిత్యనివాసముగా దేవుడు ఈ భూమిని చేయలేదు. సరిగదా పరలోక నివాసముకొరకు మానవులను దేవుడు సిద్ధపరచెను. పరలోకము యధార్ధమని మనము నమ్మునట్లు ఆయన తన ఆత్మయను సంచకరువును, అనగా బజాణాను మనకిచ్చెను. అందువలన పౌలు తన క్రైస్తవ యాత్రను ధైర్యముతో జరిగించెను. అతడొక యిసుక పునాదిపై తన ఆత్మీయ భవనమును నిర్మించలేదు. అతని నిరీక్షణ మంచి పునాదిపై ఆధారపడియున్నది. అందువలన "ఈ దేహములో నివసించుచున్నంత కాలము ప్రభువునకు దూరముగా ఉన్నామని యెరిగియుండియు, ఎల్లప్పుడును ధైర్యముగలవారమై యున్నాము" అని అతడు కొరింధులోని క్రైస్తవులను హెచ్చరించెను.

పరలోకనివాసమును గూర్చిన యీ నిరీక్షణ విశ్వాసముపై ఆధారపడియున్నది. విశ్వాసము, నిరీక్షణలను రెంటిని కలిపి అపొ. పౌలు తరచు మాట్లాడెను. 1 థెస్స 1:3లో "విశ్వాసముతో కూడిన పనిని గూర్చి, నిరీక్షణతో కూడిన ఓర్పును గూర్చి అతడు వ్రాసెను. ఎఫెస్సీ 4:4-6లో అతడు విశ్వాసమొక్కటే, నిరీక్షణయు ఒక్కటే యని వ్రాసెను. 1కొరింధి 13:13లో అతడు విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ యీ మూడును నిలుచును అని పలికెను. క్రైస్తవునికున్న నిరీక్షణ అంతయును విశ్వాసము వలన కలిగెను. అందువలన 'వెలి చూపువలన

కాక విశ్వాసమువలననే నడుచు కొనుచున్నాము'' అని అతడు ప్రకటించెను.

అనేకులు తమ అనుభవమును బట్టి, స్వజ్ఞానమును బట్టి లేక వెలిచూపును బట్టి నడుచుకొన ప్రయత్నించెదరు. అట్లుగాక క్రైస్తవులు విశ్వాసమును బట్టి నడుచుకొనవలెనని పౌలు చెప్పుచున్నాడు. అందుకే యేసు చూచి నమ్మిన వారికంటె చూడక నమ్మినవారు ధన్యులని చెప్పెను (యోహాను 20:29).

**క్రైస్తవుని విశ్వాసము గ్రుడ్డి విశ్వాసముకాదు.** అది యెరిగి యున్నట్టి విశ్వాసము. అది బయలుపరచబడిన విశ్వాసము. అది గట్టి పునాదిపై ఆధారపడినట్టి విశ్వాసము. యెహోవా యిచ్చిన సాక్ష్యమే ఆ పునాది. దేవుడు అబద్ధమాడజాలడు గనుక ఆయన యిచ్చిన సాక్ష్యము నమ్మదగినది. అందువలన ధైర్యముగలిగి యీ దేహమును విడిచిపెట్టి ప్రభువునొద్ద నివసించుటకు ఇష్టపడుచున్నాము. కావున దేహమందున్నను, దేహమును విడిచినను ఆయన కిష్టులమై యుండవలెనని మిగుల ఆపేక్షించు చున్నామని పౌలు చెప్పుచున్నాడు (5:8,9). ఈ భూమ్మీదనే యుండుట కంటె ప్రభువుతో యుండుట శ్రేష్ఠమని పౌలు ఎరుగును. అయితే ఎక్కడ ఉన్నను సరే ప్రభువున కిష్టుడై యుండవలెనని అతని ఉద్దేశ్యము.

**అటు తరువాత ఖచ్చితముగా రాబోవు తీర్పుదినమును గూర్చి పౌలు విపులముగా వ్రాసెను.** "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైననుసరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును." జరుగబోవు ఈ తీర్పు సార్వజనికమైనది. అనగా అందరికీ ఆయన తీర్పు తీర్చును. అది సమస్తమును బట్టబయలు చేయు తీర్పు. అది నిష్పక్షపాతమైన తీర్పు. అది ఆఖరి తీర్పు. అది తిరుగులేని తీర్పు. ప్రతివాడు తన దేహముతో జరిగించిన క్రియలపై ఆధారపడి తీర్చబడు తీర్పు అది. అందులో సత్యమే నిలుచును. ఆ దినమున మనలో ప్రతివాడును దేవునికి లెక్క అప్పగించవలసియుండును.

మిత్రుడా, నీ నిరీక్షణ యెట్టిది? ఒకవేళ ఈ దినమున నీవు

మరణించినయెడల, లేక క్రీస్తే ఈ రోజు మరల వచ్చిన యెడల నిత్యత్వమును నీవు ఎక్కడ గడుపుదువు? క్రీస్తుతో పరలోకములో గడుపవలెనంటే ఆయన కిష్టుడవై ఈ నాటి నుండియే జీవించుము. క్రీస్తును నమ్ముకొనుము. పాపములను విడనాడుము. క్రీస్తు నామమును ఒప్పుకొనుము. పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము బొందుము. క్రీస్తు సంఘస్థులతో కలసి దేవుని నారాధించుచు నీ నిత్య నివాసమునకై ఎదురుచూడుము.

# క్రీస్తు లేపబడి యుండకపోతే

## If Christ be not Raised?

క్రొత్త నిబంధన యొక్క ప్రాముఖ్య బోధ యేసుక్రీస్తు యొక్క పునరుత్థానము. క్రొత్త నిబంధనలో ఆయన పునరుత్థానమును గూర్చి 38 రిఫరెన్సులు వున్నాయి. మరణముపై ఆయన విజయాన్ని గూర్చి అపొస్తలుల కార్యముల గ్రంథము ఒక్కదానిలోనే 13 సార్లు చెప్పబడియున్నది. గనుక అది అపొస్తలుల యొక్కయు ఆత్మావేశ ప్రజలయొక్కయు బోధకు కేంద్రమై యుండెను. మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క పునరుత్థానమును ఒకడు విశ్వసించిన యెడల బైబిలులో వ్రాయబడిన మిగతా అన్ని అద్భుతములను అంగీకరించుట తేలికయగును. ఎవడైనా ప్రభువైన యేసుయొక్క పునరుత్థానమును తిరస్కరించిన యెడల, అతడు మిగతా అద్భుతములను తిరస్కరించును.

"కొరింథులో నున్న దేవుని సంఘమునకు" అపొ.పౌలు వ్రాసిన మొదటి పత్రికలో యేసుక్రీస్తు యొక్క పునరుత్థానమును గూర్చి అతడు సవిస్తరముగా వ్రాసాడు. అంతేగాక క్రీస్తుయొక్క రెండవ రాకడలో జరుగు సార్వజనిక మృతుల పునరుత్థానము క్రీస్తు మృతులలో నుండి తిరిగి లేచుటపై ఆధారపడియున్నదని అతడు తెలియజేసాడు. వీటిలో ఒకదానిని కాదంటే రెండవదానిని కాదన్నట్లే. పౌలు యొక్క కాలములో గ్రీకులు శరీర పునరుత్థానమునందు విశ్వసించలేదు. యూదులలో సద్దూకయ్యులు కూడా పునరుత్థానము లేదనెడి వారు (మత్తయి 22:23). 1కొరింథి 15వ అధ్యాయములో అపొ. పౌలు ఈ ప్రాముఖ్యాంశమును గూర్చి వివరించాడు. క్రీస్తు గనుక

మృతులలోనుండి లేవబడి యుండకపోతే దిగువ నుదహరించిన సంగతులు సంభవించును.

**క్రీస్తు లేపబడకపోతే మేము చేయు ప్రకటన వ్యర్థమే (1 కొరింధీ 15:14).** అపొస్తలుల బోధయొక్క ముఖ్యాంశము యేసుక్రీస్తు యొక్క పునరుత్థానము. అదేమనగా "లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిబొందెను, సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింధి 15:3-4). అపొస్తలులు చేసిన మొట్టమొదటి సువార్త ప్రసంగము క్రీస్తుయొక్క మరణ సమాధి పునరుత్థానమును గూర్చియుండెను (అపొ.కా. 2:24, 30,31).

**మీ విశ్వాసము వ్యర్థమే (15:14,17) :** యేసుప్రభువు దేవుడనే మన విశ్వాసము ఆయన పునరుత్థానముపై ఆధారపడియున్నది. ఆయన తిరిగి లేచి యుండకపోతే ఆయన చెప్పినవి అబద్ధములు ఏలయనగా ఆయన చనిపోయి తిరిగి లేతునని చెప్పెను. "యేసు ఈ దేవాలయమును పడగొట్టుడి, మూడు దినములలో దానిని లేపుదునని వారితో చెప్పెను. యూదులు ఈ దేవాలయమును నలువదియారు సంవత్సరములు కట్టిరే. నీవు మూడు దినములలో దానిని లేపుదువా అనిరి. అయితే ఆయన తన శరీరమను దేవాలయమును గూర్చి యీ మాట చెప్పెను. ఆయన మృతులలో నుండి లేచిన తరువాత ఆయన ఈ మాట చెప్పెనని ఆయన శిష్యులు జ్ఞాపకము చేసికొని, లేఖనమును యేసు చెప్పిన మాటను నమ్మిరి" (యోహాను 2:19-22) (లూకా 9:22 మరియు మత్తయి 12:40 కూడ చూడుము).

యేసు మృతులలో నుండి లేపబడని యెడల ఆయన మరణమును సమాధిని జయించలేని బలహీనుడైయుండును. దేవుని విమోచన క్రియ అంతయు యేసు యొక్క పునరుత్థానముపై ఆధారపడియుండెను. ఆయన యందు విశ్వాసముంచు వారికది ఆత్మీయ శక్తినిచ్చెను.

**మేము అబద్ధ సాక్షులుగా అగుపడుదుము (1 కొరింధి 15:15) :** మీరు నాకు సాక్షులైయుందురని యేసు అపొస్తలులకు చెప్పెను (అపొ.కా. 1:8). యేసు మృతులలో నుండి

లేపబడక పోతే అపొస్తలులందరు అబద్ధ సాక్షులగుదురు. వారందరు తిరిగి లేచిన యేసును చూచితిమని సాక్ష్యచ్చిరి. అపొస్తలులు తమ్మును తాము అందరు మోసగించబడి అయినా యుండాలి. లేదా వారు గొప్ప మోసకారులై యుండాలి. మనుష్యులకు వ్యతిరేకముగ అబద్ధ సాక్ష్యము చెప్పుట ఘోరము, క్రీస్తుకు వ్యతిరేకముగ అబద్ధ సాక్ష్యము చెప్పుట అంతకన్నా ఘోరము.

**మీరింకను మీ పాపములలోనే యున్నారు :** (17వ) మృతులలోనుండి లేపబడక ఇంకా మృతులలోనే యుండే విమోచకుడు విమోచకుడు కానే కాదు. యేసు మన పాపముల నిమిత్తమై మృతి బొందెను, నిజమే. "ఏలయనగా శత్రువులమై యుండగా ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధాన పరచబడిన యెడల సమాధాన పరచబడిన వారమై ఆయన జీవించుట చేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము" (రోమా 5:10). ఆయన మన అపరాధముల నిమిత్తము అప్పగించబడి మనము నీతిమంతులముగా తీర్చబడుటకై లేపబడెను" (రోమా 4:25).

**అంతేకాదు, క్రీస్తునందు నిద్రించినవారును నశించిరి (18వ) :** క్రీస్తుకు లోబడి ఆయన కొరకు జీవించి మరణించినవారు కూడ క్రీస్తు లేపబడియుండకపోతే నశించారు. తండ్రియైన దేవుని యెదుట వారికి ఒక ఉత్తరవాది లేకుండా పోయారు. దేవునికి వారికి మధ్యవర్తియెవడు లేనందున వారికి సహాయపడే వారెవరును లేరు. క్రీస్తు లేపబడి యుండకపోతే వారందరు దేవుని సమక్షములో తమ పాపములతోనే యున్నారు. అయితే యేసు ఇట్లు చెప్పారు: "దీనికి ఆశ్చర్య పడకుడి; ఒక కాలము వచ్చుచున్నది. ఆ కాలమున సమాధులలోనున్న వారందరు ఆయన శబ్దము విని మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకు, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానము నకును బయటకి వచ్చెదరు" (యోహాను 5:28-29).

**ఈ జీవిత కాలము మట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించు వారమైన యెడల మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులమై యుందుము (15:19):** క్రీస్తు లేపబడి యుండకపోతే అవిశ్వాసుల కన్నా విశ్వాసుల పరిస్థితియే ఘోరముగా యుండును. వారి నిరీక్షణ జాలి గొల్పును. క్రీస్తు లేపబడకపోతే క్రైస్తవులు క్రీస్తునందలి

నిరీక్షణను బట్టి పొందిన శ్రమలు, హింసలు, మరణము కూడ వ్యర్ధమే. అపొ. పౌలు తాను పొందినవి క్షణమాత్రముండు చులకని శ్రమలని వర్ణించాడు. ఎందువలననగా అతడు అంతకంతకు ఎక్కువగా యుండు నిజమైన మహిమ కొరకు ఎదురు చూచుచున్నాడు (2 కొరింధి 4:17,18). క్రీస్తు లేపబడియుండకపోతే ఆ శ్రమలన్నియు వ్యర్థము.

అయితే క్రైస్తవునికి ఈ వాగ్దానమున్నది: "మన ప్రభువగు యేసు క్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడును గాక. మృతులలో నుండి యేసుక్రీస్తు తిరిగి లేచుట వలన జీవముతో కూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు, అనగా అక్షయమైనదియు నిర్మలమైనదియు వాడబారనిదియునైన స్వాస్థ్యము మనకు కలుగునట్లు ఆయన తన విశేష కనికరము చొప్పున మనలను మరల జన్మింపజేసెను" (1 పేతురు 1:3).

యేసుక్రీస్తు పునరుత్థానము స్థిరమైన వాస్తవమని అపొ. పౌలు 1కొరింధి15:20-22లో వక్కాణించాడు. క్రీస్తు తిరిగి లేచి, పరమున కారోహణుడు కాకముందున్న నలువది దినములలో ఆయన వివిధ వ్యక్తులకు పది మారులు అగుపడెను. మగ్ధలేనే మరియకు వేరొక మరియకు మొదట ఆయన అగుపడెను. "ఆయన కేఫాకును తరువాత పండ్రెండుగురికిని కనబడెను. అటుపిమ్మట ఐదు వందలకు ఎక్కువైన సహోదరులకు ఒకే సమయమందు కనబడెను" అని అపొ.పౌలు చెప్పాడు (1 కొరింధీ 15:5-9). గనుక యేసుక్రీస్తు మృతుల లోనుంచి తిరిగి లేచినట్లున్న రుజువులు అత్యధికమైనవి.

ఆయన పునరుత్థానుడైన తరువాత అపొస్తలుల జీవితములు మార్చబడినవి. రోమా సామ్రాజ్యమంతటిలోను క్రైస్తవ్యము అతి త్వరితముగా వ్యాప్తిచెందెను. రెండువేల సంవత్సరములకు పైగా క్రీస్తుయొక్క పునరుత్థానము వలన ప్రపంచ మందంతటా కోట్ల కొలది ప్రజల యొక్క జీవితములు నేటికిని ప్రభావితము లగుచున్నవి. వారందరు యేసుక్రీస్తు దేవుడని నమ్ముదురు. అపొ.పౌలు ఇట్లను చున్నాడు: "మీరు పాపమునకు దాసులైయుంటిరి గాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో దానికి హృదయ పూర్వకముగా లోబడిన వారై పాపము నుండి విమోచింపబడి

నీతికి దాసులైతిరి. ఇందుకు దేవునికి స్తోత్రము'' (రోమా 6:17-18). రక్షింపబడిన వీరు క్రీస్తుయొక్క మరణ, సమాధి, పునరుత్థానముల క్రమమునకు బాప్తిస్మము ద్వారా లోబడిరి. బాప్తిస్మము పొందిన వీరందరు నూతన జీవితము జీవించుటకై లేవబడిరి. ఎరువు తెచ్చుకొనిన అరిమతయి యోసేపు సమాధిలో యేసు పాతిపెట్టబడినను అది ఇప్పటికీ ఖాళీగానే యున్నది. యేసు మృతులలోనుండి సజీవుడై తిరిగి లేచెననుటకు యిది అత్యంత శక్తివంతమైన నిదర్శనము!!

**– రేమండ్ ఇల్లియట్**

## దేవుడు ఎట్లుంటారు?

**(What is God like?)**

**దేవుడు నిత్యుడు :** దేవుడెల్లప్పుడు యున్నవాడు. ఆయన ఎల్లప్పుడు ఉండును. "పర్వతములు పుట్టక మునుపు, భూమిని లోకమును నీవు పుట్టింపక మునుపు యుగ యుగములు నీవే దేవుడవు" అని బైబిలు చెప్పుచున్నది (కీర్తన 90:2). భూమి మీద నివసించు మనుష్యులందరు వృద్ధులగుదురు. అందరు మరణింతురు. అయితే దేవుడెన్నడు వృద్ధుడవడు, ఎన్నడు మృతిచెందడు. బైబిలు మరల ఇట్లు చెప్పుచున్నది "ప్రభువా నీవు ఆదియందు భూమికి పునాది వేసితివి. ఆకాశములు కూడ నీ చేతి పనులే. అవి నశించునుగాని నీవు నిలిచి యుందువు. అవన్నియు వస్త్రము వలె పాత గిలును. ఉత్తరీయమువలె వాటిని మడిచి వేతువు. అవి వస్త్రము వలె మార్చబడును. నీవు ఏక రీతిగానే యున్నావు. నీ సంవత్సరములు తరుగవు" (హెబ్రీ 1:10-12).

**దేవుడు సర్వశక్తిమంతుడు :** "దేవునికి అసాధ్యమైనది యేమైనా కలదా?" (ఆది కా. 18:14). మానవ మాత్రులమైన మనము బలహీనులము. అనేక సంగతులు చేయడానికి మనకు శక్తి చాలదు. గాని దేవుడైతే సర్వశక్తిమంతుడు. ఆయన భూమ్యాకాశములను సృజించారు (యిర్మియా 10:12). ఆయన గొప్ప శక్తి చేత మానవుని సృజించారు. తాను చేసిన వాగ్దానములు నెరవేర్చడానికి దేవుని శక్తియున్నది గనుక మనమాయనను నమ్మవచ్చును.

**దేవుడు సమస్తమును ఎరిగినవాడు:** దేవునికి అంతా ఎరుకే. ఆయన అంతా

చూచుచున్నారు.. మానవులకు కనబడకుండా మనము దాగుకొనగలము గాని దేవునికి కనబడ కుండా యేదీ లేదు. "నరుని మార్గములను యెహోవా యెరుగును. వాని నడతలన్నిటిని ఆయన గుర్తించును" (సామె 5:21). మరల "దేవుడు మన హృదయము కంటె అధికుడై సమస్తము ఎరిగి యున్నాడు" (1 యోహాను 3:20).

**దేవుడు మార్పులేనివాడు :** ఈ లోకములో యున్న ప్రతి సంగతి మార్పునొందును. ప్రభుత్వములు మారును. పాత నాయకులు, పాలకులు పోయి క్రొత్తవారు వచ్చును. జీవన విధానము మారును. ప్రజల అలవాట్లు, అభిరుచులు మార్పునొందును. వాతావరణము మారుచుయుండును. ఫేషన్లు మార్పునొందును. యంత్రములు మారును గాని దేవుడెన్నడు మార్పు నొందడు. ఆయన నిన్న నేడు నిరంతరము ఒకేలాగుండును (హెబ్రీ 13:8). "యెహోవానైన నేను మార్పులేని వాడను" అని దేవుడు సెలవిచ్చుచున్నారు (మలాకీ 3:6).

**దేవుడు ఆత్మయై యున్నారు :** మన వలెనే దేవుడు మానవుడు కాదు. ఆయన మానవుడని కొందరను కొంటారు. గాని ఆయన మానవుడు కాదు, కాజాలడు (సంఖ్య 23:19; యోబు 9:32, 33:12; హోషేయ 11:9 చదువుము). "దేవుడు ఆత్మయై యున్నాడు. గనుక ఆయన నారాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆయననారాధింప వలెను" (యోహాను 4:24). నీ వలె నావలె దేవునికి శరీర సంబంధమైన బలహీనతలు, రోగములు లేవు "ఏలయనగా ఆత్మకు రక్తమాంసములు లేవు" (లూకా 24:39).

**దేవుడు వెలుగై యున్నారు :** "మే మాయన వలన విని మీకు ప్రకటించు వర్తమాన వేమనగా - దేవుడు వెలుగైయున్నాడు; ఆయన యందు చీకటి ఎంతమాత్రమును లేదు" (1 యోహాను 1:5). దేవునియందు చీకటి (పాపము) ఎంతమాత్రము లేదు. అందువలన ఆయన యందు మనము విశ్వాసముంచ గలము. ఏలయనగా ఆయన మనలను ఎన్నడు మోసగించరు.

**దేవుడు ప్రేమయై యున్నాడు :** "దేవుడు ప్రేమాస్వరూపి. ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు" (1 యోహాను 4:8). దేవుడు మనలను ప్రేమించును. ఆయన

తన ఏకైక కుమారుని మన నిమిత్తము బలియిచ్చుట ద్వారా తన ప్రేమను నిరూపించియున్నారు. "మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి మన పాపములకు ప్రాశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను. ఇందులో ప్రేమ యున్నది" (1 యోహాను 4:10).

**దేవుడు పరిశుద్ధుడు :** "నేను పరిశుద్ధుడనై యున్న ప్రకారము మీరును పరిశుద్ధులై యుండుడి" (లేవీ 19:12, కీర్తన 111:9). ఆయన పరిశుద్ధుడనే నామకరణము గలవాడు. పేతురు యూదులకిట్లు చెప్పాడు : "మీరు పరిశుద్ధుడును, నీతిమంతుడైన వానిని నిరాకరించి నర హంతకుడైన మనుష్యుని మీకు అప్పగింపుమని అడిగితిరి" (అపొ.కా. 3:14; మార్కు 1:23, 24; 1 యోహాను 2:20). తాను పరిశుద్ధ దేవుని మాటలను కాదనలేదని యోబు ఒప్పుకొన్నాడు (యోబు 6:10). "ఇశ్రాయేలీయులు పరిశుద్ధ దేవుడు" అను మాటలు పాత నిబంధనలో సాధారణముగా కనబడును (కీర్తన 89:18; యెషయా 1:4; యిర్మీయా 50:29).

**దేవుడు యదార్ధవంతుడు :** "యెహోవాయే నిజమైన దేవుడు. ఆయనే జీవము గల దేవుడు. సదా కాలము ఆయనే రాజు" (యిర్మీయా 10:10). ఆయన నమ్మకమైనవాడు, సత్యవంతుడు అను నామము గలవాడు (ప్రకటన 19:11). ఆయన సత్యస్వరూపి, పరిశుద్ధుడు (ప్రక 6:10). సత్యస్వరూపి యందుండుట యనగా దేవునిలోను క్రీస్తులోను యుండుటయే. "మనము సత్యవంతుడైన వానిని ఎరుగవలెనని దేవుని కుమారుడు వచ్చి మనకు వివేకమునను గ్రహించి యున్నాడని యెరుగుదుము. మనము దేవుని కుమారుడైన యేసుక్రీస్తు నందున్నవారమై సత్యవంతుని యందున్నాము. ఆయనే నిజమైన దేవుడును, నిత్య జీవమునై యున్నాడు" (1 యోహాను 5:20).

**దేవుడు నమ్మకమైన వాడు :** "మన ప్రభువైన యేసు క్రీస్తు అను తన కుమారుని సహవాసమునకు మిమ్మును పిలిచిన దేవుడు నమ్మతగినవాడు" (1 కొరింథి 1:9). "వాగ్దానము చేసినవాడు నమ్మతగినవాడు" (హెబ్రీ 10:23). అపవాది నుండి దేవుడు తన ప్రజలను కాపాడవలెనంటే ఆయన నమ్మదగిన వాడై యుండాలి (2 థెస్స 3:3;

1 కొరింధి 10:13). "మమ్మును పిలుచు వాడు నమ్మకమైనవాడు గనుక అలాగు చేయును'' (1 థెస్స 5:23-24).

**దేవుడు నీతిమంతుడు :** "యెహోవా నీతిమంతుడు, ఆయన నీతిని ప్రేమించువాడు. యదార్ధవంతులు ఆయన ముఖ దర్శనము చేసెదరు" (కీర్తన 11:7). ఆయన ఆజ్ఞలన్నియు న్యాయములు (కీర్తన 119:172).

**దేవుడు కృపగలవాడు :** ఆయన పాపులను ద్వేషించినను, మనలను ప్రేమించును. ఆయన కృపగలవాడు. "యెహోవా దయాదాక్షిణ్యపూర్ణుడు. దీర్ఘశాంతుడు, కృపాసమృద్ధి గలవాడు" (కీర్తన 103:8). పాపులైన వారందరు ఆయన యందు విశ్వాసముంచి తమ పాపముల విషయమై మారుమనస్సు పొంది ఆయనకు లోబడినప్పుడు వారి పాపములన్నిటిని ఆయన క్షమించును. వారు తమ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందితే తన కుమారుడైన క్రీస్తు రక్తములో వాటిని ఆయన కడిగి వేసి వారిని క్షమించును (అపొ. 2:38; మత్తయి 26:28).

- సామ్యూల్ మేత్యూస్

## యేసు నరావతారమెత్తిన దేవుడు

**(Jesus is the Incarnate God)** (I తిమోతి 3:16)

**పరిచయము :**

దేవుడు శరీరధారియై ఈ లోకమునకు వచ్చెను.

క్రీస్తు శరీరధారియై వచ్చె ననునది క్రైస్తవ్యము యొక్క ముఖ్య మూలపాఠము. యేసుశరీరధారియై వచ్చెననుట వక్కాణించబడినది.

కల్వరి సిలువలో శరీరధారి యైన దేవుడు మనకు బదులుగా బలి అవ్వకపోతే మరణము నిరర్ధకము చేయబడియుండదు. ఒకానొక దినమందు మనకు కూడ పునరుత్థానము కలుగును.

యేసుయొక్క అవతారము క్రైస్తవ్యమునకు ఎంత ప్రాముఖ్య మైనదంటే అది సహవాసము యొక్క ముఖ్య పరీక్ష అయ్యున్నది.

**I. యేసు యొక్క అవతారమంటే ఏమిటో మొదట తెలిసికొనవలెను.**

ఎ. అవతారము అనుమాట బైబిలులో లేదు. అవతారమనునది

వేదాంత సంబంధమైన పదము. దేవుని కుమారుడు మానవునిగా ఈ లోకమందు అవతరించుట యనునది దాని భావము. అవతారము అను మాట బైబిలు నందు వాడబడక పోయినా యేసు శరీరము ధరించిన వ్యక్తిగా వచ్చెనను లేఖన భావములపై ఆధారపడి యున్నది (రోమా 8:3; ఎఫెసీ 2:15; కొలస్స 1:22).

**బి.** బైబిలు నందు ప్రశ్నింపతగని బోధ క్రీస్తుయొక్క నరావతారము. ఆదియందు దేవునితో యుండి, దేవుడైయుండిన వ్యక్తి, కాలము పరిపూర్ణమైనప్పుడు, పరిశుద్ధాత్మ శక్తితో నరావతారమెత్తెను.

ఒక కన్యయొక్క గర్భము ద్వారా ఆయన ఈ లోకమందు ఉద్భవించెను (యోహాను 1:1).

కన్య గర్భముద్వారా యేసు యొక్క అవతారము సంభవించెను. మత్తయి 1:18-25; లూకా 1:31-35; 2:11, గలతీ 4:4; ఆదికా 3:15).

యేసుక్రీస్తు శరీరమును బట్టి జన్మించెను (రోమా 1:4). "మరణము యొక్క బలము గలవానిని అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకు" ఆయన రక్తమాంసములు గలవానిగా అవతరించెను" (హెబ్రీ 2:14). మరియు "దేవుని సంబంధమైన కార్యక్రమములలో కనికరమును నమ్మకమును గల ప్రధాన యాజకుడగు నిమిత్తము అన్ని విషయాల్లో ఆయన తన సహోదరుల వంటివాడు కావలసి వచ్చెను" (హెబ్రీ 2:17).

1. యోహాను 1:1, 14 ఆ వాక్యము శరీరధారియై వచ్చెనని విపులీకరించుచున్నది. ఆయన బేత్లెహేములో కన్య మరియ గర్భము ద్వారా ఉదయించెను.

**సి. యేసుయొక్క శరీరావతారము క్రైస్తవ్యమునకు ముఖ్యము.**

యేసు నరావతారియై వచ్చెనంటే, ఆయన అంతకుముందు నుండే యున్నవాడని యర్థము. నరావతారమెత్తిన రక్షడు, శరీరధారియై ప్రత్యక్షమైన దేవుడు. బెత్లేహేములో యేసు తన జీవితము నారంభించలేదు. బెత్లేహేము సృజింపకముందునుండే ఆయన యున్నారు (యోహాను 1:1-14).

ఆయన నిత్యుడైన దేవుడు, దేవునితో సమానుడు. "ఆయన శరీరధారియై యున్న దినములలో" యని భూమిపై ఆయన అవతార కాలము వర్ణించ బడినది(హెబ్రీ 5:7-8).

ఆయన పూర్వపు వునికిలో వాక్యమై యున్నారు. శరీరధారి యగువరకు ఆయన కుమారుడు కాదు (లూకా 1:35, యోహాను 1:1).

యేసుక్రీస్తు శరీరధారియైనను సంపూర్ణ దైవత్వమును కలిగి యుండెను.

పునరుత్థానుడైన ప్రభువు యొక్క దైవత్వమును, మానవత్వమును తోమా అంగీకరించెను (యోహాను 20:27-28).

యేసుక్రీస్తు యొక్క సమానాంతర మానవత్వము దైవత్వములను అపో.పౌలు వక్కాణించాడు (రోమా 9:5, ఫిలిప్పీ 2:6-11; కొలస్స 2:9).

**II. యేసుయొక్క శరీరావతారాన్ని పాత నిబంధన ప్రవచించెను.**

యేసుయొక్క శరీరావతారాన్ని గూర్చి పరిశుద్ధ లేఖనములయందు దేవుడు తన ప్రవక్తల ద్వారా ముందుగా తెలియజేసెను. యేసు శరీరమును బట్టి దావీదు సంతానముగా అవతరించెనని అపో.పౌలు వక్కాణించాడు (రోమా 1:2-7).

ఆది కా. 3:15లో యేసుయొక్క భవిష్యత్ అవతారమును గూర్చి మొట్టమొదటి సూచన ఇయ్యబడెను.

ఆదాము హవ్వలు పాపములేని వారుగా యున్న కాలములో గాక వారు పాపము చేసిన తరువాతనే దైవావతారమును గూర్చిన సూచన ఇయ్యబడెను.

దేవుడు అబ్రహాముకు చేసిన వాగ్దానము, అనగా అబ్రహాము సంతతి ద్వారా ఈ లోక జనాంగములన్నియు ఆశీర్వదించ బడునను వాగ్దానములో దేవుని భవిష్యత్ నరావతారము సూచింప బడెను (ఆది కా. 18:15,18; అపో.కా. 3:22-26).

పాత నిబంధనలో ముఖ్యమైన లేఖనములు "బలవంతుడైన దేవుడు" వెం॥గునవి యేసుయొక్క నరావతారమును సూచించుచున్నవి (యెషయా 7:14; 9:6).

మన ప్రభువు కన్యగర్భమున

జన్మించెననుట ఆయన శరీరధారియై వచ్చెననుటయే (లూకా 5:2).

క్రీస్తును సూచించు పాత నిబంధన ప్రవచనములు ఆయన యొక్క మానవత్వమును, దైవత్వమును సూచించు నప్పుడు ఆయన స్త్రీ సంతానము, అబ్రాహాము సంతానము, యూదా సంతతివాడు, దావీదు కుమారుడు, దుఃఖాక్రాంతుడైన మానవుడు అను మొదలగు రీతిగా వర్ణించబడెను. అంతేగాక ఆయన బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, దేవుని కుమారుడు, సమాధాన కర్త యని మొదలగు పదములతో కూడా వర్ణించబడెను.

యేసుక్రీస్తు యొక్క అవతారమును గూర్చి బోధించు లేఖనములతో క్రొత్త నిబంధన నిండి యున్నది. దిగువ లేఖన భాగములను పరిశీలించుము :

యోహాను 1:1-14; 4:2-3; రోమా 1:2-5; ఫిలిప్పీ 2:6-11; 1 తిమో 3:16; హెబ్రీ 2:14.

1. యోహాను 1:1, 14 యేసుక్రీస్తు యొక్క శరీరావతారమును గూర్చి గొప్పగా చాటుచున్నవి. యోహాను మొదటి అధ్యాయము మొదటి వచనముకు, 14వ వచనముకు గల అత్యంత సన్నిహిత సంబంధమును గూర్చి చదువరి తప్పక ఆశ్చర్య చకితుడగును. వాక్యము దేవుని యొద్ద ఉండెను (ఎల్లప్పుడు వుండెను). ఆ వాక్యము శరీరధారియై మనమధ్య నివసించెను.

2. ఫిలిప్పీ 2:7-8 యేసు మనుష్యుల రూపము ధరించుకొనెనని చెప్పుచున్నది.

3. మనుష్య కుమారుని గూర్చి యున్న లేఖనములు యేసుయొక్క శరీరావతారమును వక్కాణించు చున్నవి. (దానియేలు 7:13; మత్తయి 8:20; 9:6; 10:23; 11:19; 12:8,40; 16:27-28; 17:9,12; 19:28; 2:18; 24:27,30; 25:31-40,64; మార్కు 10:45; 14:61-62; లూకా 9:43-44; 19:10; యోహాను 1:51; 3:13-14; 6:27, 53; 12:23; అపో.కా. 7:56; ప్రక 1:13; 14:14).

4. బైబిలు అంతయు యేసు యొక్క నరావతారమును గూర్చి నిండి యున్నది. ఇంత గొప్ప బైబిలు సపోర్టు గలిగిన బోధ వేరొకటి యేదీ లేదు.

**III. యేసుయొక్క నరావతారము ప్రశ్నింపతగని వాస్తవము :**

ఎ. యేసు శరీరావతారమెత్తుట నిస్సందేహమైన, నిరాక్షేపమైన వాస్తవము అని అపో.పౌలు చెప్పాడు (I తిమో 3:11). తాను చెప్పే సత్యమును గూర్చి ఆక్షేపము యేమీలేదని పౌలు చెప్పాడు. ఆ మర్మము గొప్పది. తాను చెప్పేది యిదివరకు గొప్పమర్మమై యుండెను. గాని యిప్పుడదికాదు.

బి. మరియు కుమారుడైన యేసుకు ఇయ్యబడిన దైవిక నామములు ఆయన నరావతారమును సూచించుచున్నవి. యేసు అను పేరు రక్షణను వక్కాణించుచున్నది. ఆయన తన ప్రజలను వారి పాపముల నుండి తానే రక్షించును. ఇమ్మానుయేలు అను పేరు ఆయన అవతారమును గూర్చి వక్కాణించుచున్నది. దేవుడు మనతో యున్నాడు.

సి. యేసు యొక్క అవతారమును నిరాకరించుట మత భేదమే. యేసు యొక్క నరావతారమును గూర్చిన బోధ సహవాస సంబంధమైనది యని Ralph Gilmore అనునతడు చెప్పాడు. యేసుయొక్క దైవత్వము, మానవత్వము కూడ రక్షించే ఆయన పనికి ముఖ్యమని అపొస్తలుల వ్రాతలు సూచించుచున్నవి. అందువలన యేసు నిజంగా మానవుడు, నిజంగా దేవుడు అని నిరాకరించు దానిని మత భేదముగా పరిగణించాలి. అది సువార్తకు నాశనము కలుగ జేయునట్టిది

2. "యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని యే ఆత్మ ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది. యే ఆత్మ యేసును ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదు." "అట్టిది క్రీస్తు విరోధి ఆత్మ" (1 యోహాను 4:2-3; II యోహాను 7).

3. తాను శరీరాకారముతో యున్నవాడినని యేసుక్రీస్తే ప్రకటించెను (లూకా 24:39).

4. మానవులు యేసుక్రీస్తును శరీర రీతిగా ఎరిగిన వారని అపో.పౌలు ప్రకటించాడు (2 కొరింథీ 5:16).

5. యేసుక్రీస్తును శరీర రీతిగా తాకితిమని, చూచితిమని అపో.. యోహాను వ్రాసాడు. దీనినే అతడు ప్రకటించాడు (I యోహాను 1:1-3).

**IV. క్రీస్తు శరీర రీతిగా అవతార మొందుట వలన ప్రయోజనము లనేకములు :**

ఎ. యేసు శరీరాకారముతో వచ్చినందున మానవులు ఎదుర్కొను శోధనలు ఆయన అనుభవించగలిగెను (హెబ్రీ 2:18; 4:15).

బి. యేసు శరీరాకారముతో అవతరించినందున దేవునికి మానవులకు మధ్య ఒక పరిపూర్ణ ప్రధాన యాజకునిగా నుండెను (హెబ్రీ 2:17).

సి. యేసుయొక్క నరావతారము వలన ఈ లోక పాపముల నిమిత్తము పరిపూర్ణ బలిగా ప్రయోజకుడాయెను (హెబ్రీ 9:26; 10:12).

1. యేసుక్రీస్తు శరీర విషయములో చంపబడెను, పాపముల విషయములో శ్రమ పడెను (I పేతురు 3:18; 4:1).

2. యేసుయొక్క "మాంసయుక్తమైన దేహమందు మరణము వలన మిమ్మును సమాధానపరచెను" (కొలస్స 1:22; ఎఫెసీ 2:15-16).

డి. యేసు యొక్క శరీరావతారము ద్వారా నశించినవారిని దేవుడు వెదకి రక్షించుటకు గాను అది ఆయన ప్రత్యేక విధానమాయెను. (మత్తయి 1:21; లూకా 19:10; 1తిమోతి 1:15; హెబ్రీ 9:26,28; I యోహాను 3:5).

ఇ. యేసుక్రీస్తుయొక్క మరణ, సమాధి పునరుత్థానము వలన మానవులపై మరణము యొక్క బలము నశింప జేయబడెను (2 తిమో 1:10; హెబ్రీ 2:14-15).

ఎఫ్. యేసుక్రీస్తు శరీరావతారము ద్వారా దేవుడు అపవాది క్రియలను లయపరచ వీలయ్యెను (I యోహాను 3:8).

జి. యేసు యొక్క అవతారము వలన మానవులు సమృద్ధి జీవమునను భవించగలరు (యోహాను 10:19).

**ముగింపు :**

యేసు యొక్క అవతారము వలన ఇహ పరములు సంధిచేయబడెను, బంధింపబడెను.

యేసు యొక్క అవతారము దేవుని ప్రేమకు సాక్ష్యమిచ్చు చున్నది.

ఆయన తన ప్రజల నెరుగుటయే గాక, వారిలో ఒకడాయెను.

యేసుయొక్క అవతారము మానవ జాతికి సంభవించిన గొప్ప అద్భుతము. ఈ లోకసృష్టికర్తయైన సర్వశక్తిగల దేవుడు ఈ లోకమును, మానవుని సృజించిన దేవుడు తన్ను తాను తగ్గించుకొని మానవావతారియై, దాసుని స్వరూపము ధరించుకొని, మానవునివలె వారి మధ్య జీవించి, తన చట్టమునకు తానే బద్ధుడై జీవించి మరణించి మృత్యుంజయుడై లేచుట అద్భుతములకు అద్భుతము.

**ఆహ్వానము :** దేవుడు క్రీస్తు రక్తము ద్వారా తన సంఘమును కొనెను (అపొ.కా. 20:28). బాప్తిస్మము పొందుట ద్వారా మనము ఆయన రక్తము దరికి చేరుకొని రక్షింపబడగలము (తీతు 3:5; ప్రక 1:5).

పాపము చేసిన క్రైస్తవుడు కూడా రక్షించు క్రీస్తు రక్తము చేత శుద్ధి చేయబడును (I యోహాను 1:7-10).

**- లూయిస్ రష్మోర్**

## సత్యము యెడల మన బాధ్యతలు

**(Obligations to the Truth)**

### సత్యమనగా యేమి?

యోహాను 18:38లో పిలాతు యేసును ఈ ప్రశ్న అడిగాడు. యేసు సత్యమనగా తండ్రియైన దేవుని వాక్యమని యోహాను 17:17లో చెప్పారు. కొలస్స 1:5లో పౌలు సువార్త సత్యమును గూర్చి వ్రాసాడు. దేవుని వాక్యమును సత్యమును పౌలు జోడించాడు (I థెస్స 2:13). తాను సత్యవాక్యమునే చెప్పుచున్నానని అతడు ఫేస్తుకు తెలియజేసాడు (అపొ.కా. 26:25). ఎఫెసీయులు వినిన సత్య వాక్యమును గూర్చి పౌలు తెలియజేసాడు (ఎఫెసీ 1:13). ఏ సందర్భములోనైనా సత్యమే శక్తివంతమైనది. అది తీర్పు తీర్చు పరిమాణము (యోహాను 12:48). ఆరాధన యొక్క కొలమానము (యోహాను 4:24) మరియు జీవన పరిమాణము (కొలస్స 1:23). అది ఎన్నడు నాశనము గావింపబడదు (మత్తయి 24:35). సత్యము యెడల మన బాధ్యతను గుర్తించుము;

**సత్యమును వినవలెను :** సత్యమును వినాలి. లేదా నాశనము గావింపబడుదుము (యోహాను 14:6;

అపో.కా. 3:23). జ్ఞానియైన వాడు ప్రభువు మాటలను వినును (మత్తయి 7:24-27). ఎఫెసీయులు సత్యవాక్యమును వినియుండిరి (ఎఫెసీ 1:13).

**సత్యమును తెలిసికోవాలి :** సత్యవాక్యమును గ్రహించుకోవాలని బైబిలు పదే పదే హెచ్చరించుచున్నది (I తిమో 2:4). మనము సత్యమును తెలిసికోగలము (యోహాను 8:32). దానిని గ్రహించుకోగలము (ఎఫెసీ 3:3,4; 5:17). సత్యమును ఎరిగి యుండినవారిని గూర్చి పౌలు వ్రాసాడు (I తిమో 4:3). సత్యవాక్యమును సరిగ విభజించు జ్ఞానము కలిగియుండు నంతగా దానిని మనము ఎరిగి యుండాలి (2 తిమో 2:15). సత్యమును ఎరిగి యుండినవారిని గూర్చి యోహాను వ్రాసాడు (2 యోహాను :1).

**సత్యమును విశ్వసించవలెను :** సత్యమును నమ్మని వారికి శిక్ష విధింపబడును (2 థెస్స 2:12). ప్రభువును ఆయన వాక్యమును విశ్వసించకపోతే ఒకడు పాపములోనే మరణించును మరియు పరలోకములో ఆయనతో నిత్యముండే అవకాశమును కోల్పోవును (యోహాను 8:21-14). సత్య వాక్యమును వినుటయు, దాని ద్వారా పరిశుద్ధపరచబడుటయు జోడింప బడినవి (2 థెస్స 2:13).

**సత్యమును ప్రేమించుము :** సత్యవాక్యమును నమ్మక దుర్నీతి యందు అభిలాష గలవారు నశింతురని పౌలు 2 థెస్స 2 : 10-12లో వ్రాసాడు. అందు వలననే కీర్తన కారుడు "నీధర్మ శాస్త్రము నాకెంతో ప్రియమైనదని వ్రాసాడు (కీర్తన 119:97). మనము ప్రేమించు సంగతులను గూర్చి ధ్యానింతుము. నీవు సత్యమును గూర్చి అనుదినము ఆలోచింతువా?

**సత్యమునకు లోబడుము :** సత్యమునకు విధేయులగుట ద్వారా పరిశుద్ధ పరచబడిన ఆత్మలను గూర్చి పేతురు వ్రాసాడు. సత్య వాక్యములో ఆజ్ఞలున్నవి. వాటికి తప్పక లోబడాలి. క్రీస్తు తనకు విధేయులైన వారందరికీ నిత్య రక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:8-10). సత్యమునకు విధేయులు కానివారియొక్క దయనీయ స్థితిని గూర్చి రోమా 2:8లో చెప్పబడి

యున్నది. గలతీయులు సత్యవాక్యము నకు లోబడకుండా మోసగింపబడి, అభ్యంతర పరచబడిరి (గలతీ 3:1; 5:7).

**సత్యములో నడువుము :** సత్యములో నడుచుటను గూర్చి యోహాను వ్రాసాడు. తన పిల్లలు సత్యములో నడుచున్నందున సంతోషించు చున్నానని అతడు వ్రాసాడు (2 యోహాను:4). గాయు సత్యములో నడుచు చున్నాడని విని అతడు సంతోషించెను (3 యోహాను : 3). తన పిల్లలు సత్య వాక్యములో నడుచుకొనుచున్నారనుట కంటే అధిక సంతోషము తనకు లేదని యోహాను మరల వ్రాసాడు (3 యోహాను :3). మనము వెలుగులో నడిచితే సత్యములో నడిచినట్లే (I యోహాను 1:7).

**సత్యమును పరిరక్షించుము :** క్రీస్తు సంఘము సత్యముకు స్థంభమును దాని ఆధారమునై యున్నది (I తిమో 3:15). పౌలు విశ్వాసమును కాపాడుకొన్నాడు. దాన్ని పరిరక్షించాడు (2 తిమో 4:6-8). అతడు సత్యమును పరిరక్షించుటకు సిద్ధపడియున్నాడు (ఫిలిప్పీ 1:17). ప్రేమతో సత్యమును చెప్పాలి (యాకోబు 5:19). కొందరు సత్యమును మార్చుటకు ప్రయత్నిస్తారు (2 తిమో 4:4). మనందరము సత్య వాక్య ప్రియులమై దానిని పరిరక్షించాలి.

**సత్యము ఒకనిని స్వతంత్రునిగా చేయును** (యోహాను 8:32). మనము సత్యము వలన జనింప చేయబడ్డాము (యాకోబు 1:18; 1పేతురు 1:23) మనము సత్యమునకు లోబడినప్పుడు మన ఆత్మలు పవిత్ర పరచబడతాయి (I పేతురు 1:22). అందువలన సత్యము పాపమునుండి మనలను విడుదల చేయును (రోమా 6:17-18). సత్యము రక్షణను ప్రసాదిస్తాది (ఎఫెసీ 1:13). ఏలయనగా మార్గము, సత్యము జీవమైయున్న యేసుక్రీస్తు యొక్క రక్తము దరికి అది మనలను చేర్చును (యోహాను 14:6).

సత్యవాక్యము యెడల నీ బాధ్యతను నెరవేర్చుచున్నావా?

– వేన్స్ హట్టన్

# క్రీస్తు సంఘము, మతశాఖలు

**(The Church and the Denominations)**

క్రీస్తు సంఘమునకును వివిధ మతశాఖలకును యున్న వ్యత్యాసమేమి? ఈ వ్యాసములో ఆధునిక మతశాఖలను గూర్చి క్లుప్తముగా తెలిసికొందాము.

తాను వాగ్దానము చేసిన రీతిగా యేసుక్రీస్తు మరణించి, సమాధిచేయబడి పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకోస్తునాడు తన సంఘమును స్థాపించెను (మత్తయి 16:18, అపో.కా.2).

కొత్త నిబంధన కాలములో ఒకే ఒక్క సంఘముండెను. ప్రతి క్రైస్తవుడు దానిలో సభ్యుడైయుండెను.

ఆ నాటి ఆదిమ క్రైస్తవుల విశ్వాసమునకు, ఆచరణకు యున్న ఏకైక మార్గదర్శి దేవునివాక్యమే (2 యోహాను:9; 1 పేతురు 4:11:2 తిమో 3:16-17).

క్రీస్తు యొక్క సంఘము మతశాఖకాదని గమనించుము.

ఆదిమ నమూనా నుండి, విశ్వాసము నుండి ప్రజలు తొలగి పోవుదురని ప్రభువు ముందుగానే హెచ్చరించెను.

అట్లే విశ్వాస భ్రష్టత్వము సంభవించెను (1తిమో 4:1, 2 తిమోతి 4:2,4. అపో.కా 20:29,30, 2థెస్స 2:3).

రోమన్ కేథలిక్కు సంఘము అను ఒక సంస్థ ఆదిమ విశ్వాసము నుండి తొలగిపోయిన వారివలన ఉద్భవించెను. అది క్రీస్తు తన సంఘమును స్థాపించిన కొన్ని శతాబ్దములకు ఆరంభించెను.

రోమన్ కేథలిక్కు సంఘమును సవరించుటకు గాను ప్రొటెస్టాంటుల మొదటి డినామిషన్ ఆరంభమాయెను.

కేథలిక్కుల తప్పుడు పద్ధతులను కొన్ని వారు సవరించినను ప్రొటెస్టాంటులు అనేక యితర తప్పుడు పద్ధతులను ప్రవేశపెట్టిరి. అవేవనగా.

**- వందలాది శాఖలు**

**- లేఖన విరుద్ధమైన బోధలు**

**- లేఖన విరుద్ధ నామములు**

**- లేఖన విరుద్ధ పాలన పద్ధతులు**

**- లేఖన విరుద్ధ ఆరాధన**

- రక్షణ సంకల్పమును సత్యవాక్య ప్రకారము బోధించకపోవుట.

ప్రజలు మతశాఖల పద్ధతులను విసర్జించి క్రొత్తనిబంధన విశ్వాసమును, ఆచరణను అనుసరించుకు నిశ్చయించుకొన్న చోట క్రీస్తు సంఘములు నేడున్నాయి. బైబిలు సంకల్పముకు భిన్నముగా యున్న ప్రతి పద్ధతికి మేము విరుద్ధము, నిజ సంఘము

మతశాఖ కాదు. దానిని ఎరుగనివారు అదొక మతశాఖయని తలంతురు. ప్రజలు లేఖన విరుద్ధ సంగతులను మానవ కల్పితశాఖలను విసర్జించి బైబిలు మార్గములో ప్రవేశించాలని వారిని గూర్చి నిరంతరము ప్రయత్నించాలి.

ప్రజల హృదయాలను, ఉద్దేశాలను ప్రశ్నించుట మా పనికాదుగాని ఏయే బోధలు, పద్ధతులు, ఆచారాలు లేఖన విరుద్ధములో మనం తెలిసికోగలము. వాటిని దేవుని వాక్యముతో పోల్చి చూడగా అవి వాక్యవిరుద్ధములని గ్రహించగలము. దేవుని వాక్యానికి విరుద్ధమైనవి దేవునికి విరుద్ధమైనవే! గలతి 1:6-9 చూడుము.

ప్రజలు డినామినేషన్లకు అలవాటు పడిపోయినందున, అవి నిజ క్రైస్తవ్యానికి భిన్నమైనవని వారు గ్రహించుకొనుట కష్టము. అందువలన క్రీస్తు సంఘము కూడ ఇంకొక మతశాఖయని వారు భావిస్తారు. గాని :

- **సంఘమును క్రీస్తు స్థాపించెను (మత్తయి 16:18)**
- **అదొక డినామినేషన్ కాదు.**
- **అది కేథలిక్కులదిగాని, ప్రొటెస్టాంటులదిగాని, యూదులదిగాని కాదు.**
- **దాని ఏకైక విశ్వాస ప్రమాణము బైబిలు మాత్రమే.**
- **దాని ఆచార పద్ధతులు అన్ని బైబిలును బట్టియే యుండును.**
- మానవ పద్ధతులనుగాక బైబిలును మాత్రమే ప్రజలు ఎక్కడ అనుసరించినా అక్కడ క్రీస్తు సంఘముండును

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17
Date of Posting: 14 & 15th every month

From :
SATYAVAKKU
P.O. Box 80, Kakinada - 533 001



Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004